

పర్యావరణ పరిరక్షణ గురించి వివరిస్తున్న అధికారులు

## పర్యావరణాన్ని కాపాడుకుందాం..

- సైకిల్ యాత్రికుడు రాబిన్‌సింగ్ ● బాసర ట్రిపుల్ ఐటీకి రాక

బాసర, డిసెంబర్ 29: పర్యావరణాన్ని కాపాడుకుందామని సైకిల్ యాత్రికుడు రాబిన్ సిం గ్ అన్నారు. గ్రీన్ ఇండియా మూవ్‌మెంట్ పేరుతో దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్ వాసి, పర్యావరణ ప్రేమికుడు రాబిన్‌సింగ్ శుక్రవారం నిర్మల్ జిల్లాలోని బా సర ట్రిపుల్ ఐటీకి చేరుకున్నారు. ఆయనకు బయోసైన్స్, బయో ఇన్ఫర్మేషన్ డిపార్టుమెంట్, ఎన్‌ఎస్‌ఎస్ వింగ్ అధ్యాపకులు విద్యార్థులు స్వాగతం పలికారు. వాయు, నీటి కాలుష్యం, కలుషిత ఆహారం, రసాయన ఎరువులు, తదితరాలపై ఆయన వివరించారు. 6 అక్టోబర్ 2022న తన సైకిల్ యాత్ర ప్రారంభించగా, 449 రోజులు పూర్తయినట్లు తెలిపారు. బాసర ఆర్జీయూకేటీకి చేరుకునేసరికి 26,648 కిలో మీటర్లు ప్రయాణం చేసినట్లు చెప్పారు. దీని తర్వాత ఛత్తీస్ గఢ్, మధ్య ప్రదేశ్‌లలో తన యాత్ర కొనసాగుతుందని చెప్పారు. యాత్ర ముగింపు మార్చి 7,2024 భూపాల్‌లో ముగుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ డైరెక్టర్, ప్రొఫెసర్ సతీశ్ కుమార్‌తో పలు అంశాలపై చర్చించారు. బయోసైన్స్ అండ్ బయోఇన్ఫెక్షన్ అధ్యాపకులు డా. సాయికృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రాకేశ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ రామారావు, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శనివారం 30 డిసెంబర్ 2023 | ADILABAD

## పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్


నిర్మల్ అర్బన్, డిసెంబర్ 29: నిర్మల్ జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన కొత్తగా నిర్మించిన వ్యాపార సముదాయంతో జిల్లా పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్‌ను ఎస్పీ ప్రవీణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు క్యాంటీన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ గంగా రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు పురుషోత్తం, శ్రీనివాస్, నవీన్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ రావుల దేవేందర్ తదితరులున్నారు.

# అభయ హస్తం.. అయోమయం

### లోపభూయిష్టంగా ఐదు గ్యారెంటీల దరఖాస్తు ఫారం

- అనేక సందేహాలు.. అనుమానాలు
- కొన్ని ప్రశ్నలకు అధికారుల దగ్గర సైతం సమాధానం కరువు
- ఇబ్బందుల్లో దరఖాస్తుదారులు
- సర్కారు స్పందించాలని వేడుకోలు

*అభయహస్తం ఐదు గ్యారెంటీల దరఖాస్తు ఫారం ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నది. పూర్తి లోపభూయిష్టంగా ఉండగా, దరఖాస్తు దారులను తికమకపెడుతున్నది. అప్లికేషన్ నింపేటప్పుడు అనేక అనుమానాలు తలెత్తుతుండగా, ఆయాచోట్ల ఉన్న అధికారులకు సైతం స్పష్టత లేకపోవడం అయోమయానికి గురిచేస్తున్నది. ఇక చేసేదేమీ లేక కొందరు నిరాశతో వెనుతిరుగుతుండగా, మరికొందరు తమకు తోచినంత వరకు ఫారం నింపి ఇచ్చేసి రావడం కనిపిస్తున్నది. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి ప్రతి సందేహంపై పూర్తి క్లారిటీ ఇవ్వాలని ప్రజానీకం కోరుతున్నది.*




మంచిర్యాల, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అభయహస్తం ఐదు గ్యారెంటీలకు ఒకే దరఖాస్తు నింపమనడమో.. లేక టెక్నికల్ సమస్యలపై అధ్యయనం చేసి విధివిధాలను సిద్ధం చేయకపోవడమో తెలియదు కానీ.. పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకానికి సంబంధించి అన్నింటికీ ఒకే అర్జీ పత్రం తీసుకురాగా, అనేక సందేహాలు వస్తున్నాయి. ఆయా అంశాల్లో స్పష్టత లేకపోవడంతో.. అక్కడున్న అధికారులను అడిగితే.. మీరైతే ఫారం నింపి ఇవ్వండి.. తర్వాత చూద్దాం అనే సమాధానం చెబుతున్నారు. మరో రెండు, మూడు నెలల్లో ట్రాన్స్‌ఫర్ అవుతాం.. ఈ అప్లికేషన్లను అడిగేవారెవరూ.. చూసేవారెవరూ అంటూ అధికారులే నిట్టూరుస్తుండడం గమనార్హం. ఈ విషయం బయటికి చెబితే ఇచ్చే పథకం ఎక్కడ ఆపుతారోనని జనం భయపడిపోతున్నారు. అనేక మంది చేసేదేమీలేక తమకు తోచినంత వరకు ఫారం నింపి ఇచ్చి పోతున్నారు.

### జనాల మది తొలుస్తున్న ప్రశ్నలు..

**మహాలక్ష్మి పథకం :** 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.2500 ఇస్తామనేది ఈ పథక ముఖ్య ఉద్దేశం. కానీ.. రేషన్‌కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది కంగారు పడుతున్నారు. తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చిన్నవయసులోనే ఆడపిల్లలకు పెండ్లిళ్లు చేస్తారు. పెండ్లై పోయిన ఆడపిల్లలు ఆధార్‌కార్డులో భర్త ఇంటి పేరు.. అడ్రస్‌లు మార్చుకున్నారు. ఇప్పుడు రేషన్ కార్డు ఉంటేనే ఇస్తామనడంతో తల్లి ఊరిలో దరఖాస్తు చేసేందుకు ఆధార్‌కార్డులో వివరాలు మార్చుకోవాలా.. లేదా.. అనే విషయంపై స్పష్టత లేదు. దీంతో కొందరు ఆధార్‌లో వివరాలు మార్చుకునేందుకు ఆధార్ అప్‌డేషన్ సెంటర్ల దగ్గర క్యూ కడుతున్నారు.



మంచిర్యాల టౌన్ : దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

**రూ.500కే గ్యాస్ సిలిండర్ :** ఈ పథకం అమలు తీరుపైనా అనేక సమస్యలు ఉన్నాయి. చాలా మంది ఉద్యోగం రీత్యా వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. రేషన్‌కార్డు మాత్రం సొంత ఊరిలో ఉంది. గ్యాస్ కనెక్షన్ మరో ఊరిలో ఉంది. సంవత్సరానికి ఎన్ని సిలిండర్లు వాడుతారనే కాలమ్ ఇచ్చారు. అందులో వివరాలు నమోదు చేస్తే ఏమైనా కటాఫ్ పెడతారా అన్న సందేహం వస్తున్నది.

**రైతు భరోసా పథకం :** ఈ పథకం అప్లికేషన్ కూడా తలనొప్పులు తెచ్చిపెడుతున్నది. ఇంటి యజమాని(భర్త) పేరుతో దరఖాస్తు చేస్తే, ఇంట్లో మిగిలిన వారి (భార్య, పిల్లలు) పేరు మీద ఉన్న భూమి సర్వే నంబర్లు ఎలా ఇవ్వాలి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉంటున్న వ్యక్తికి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు ఇక్కడే ఉన్నాయి. కానీ వ్యవసాయ భూమి మాత్రం సిరిసిల్ల జిల్లాలో ఉంది. ఇప్పుడు జగిత్యాల జిల్లాలో ఉన్న భూమి సర్వే నంబర్లు వేస్తే.. మంచిర్యాల అధికారులకు అది ఎలా తెలుస్తది. కౌలు తీసుకున్న రైతులు కూడా దరఖాస్తు చేస్తారు సరే.. కానీ రైతు నుంచి కౌలు అగ్రిమెంట్ లేకపోతే దరఖాస్తులో చెప్పాలా.. వద్దా.. ఒక ఐదెకరాలు ఉన్న రైతు మరో ఐదెకరాలు వేరే వారి దగ్గర తీసుకొని సాగు చేస్తున్నాడు. అప్పుడు రెండూ కలిపితే 10 ఎకరాలు అవుతాయి. ఆ వివరాలు చెప్తే 10 ఎకరాలు ఉన్నాయని మొత్తానికే ఇయ్యకుంటే ఎట్లా... సాగు చేస్తున్న భూమి వివరాలు.. సర్వే నంబర్, విస్తీర్ణంతో పాటు చెప్పమని దరఖాస్తులో అడిగారు. కానీ చిన్న డ్యాష్ ఇచ్చి వదిలేశారు. అందులో రాయడానికే సరిపోవడం లేదని కొందరు చెబుతున్నారు. వీటన్నింటికీ సమాధానాలు కావాలని రైతులు అడుగుతున్నారు.

**ఇందిరమ్మ ఇండ్లు :** ఇల్లులేని వారికి ఆర్థిక సాయం అనే కాలమ్ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు రెండు, మూడు ఫ్యామిలీలు కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాయి. తల్లీతండ్రి, వారి కొడుకులు అంతా కలిసే ఉంటున్నారు. వీరందరి అడ్రస్ ఒకటే.. ఇందులో మిగిలిన వారికి సొంత ఇళ్లు కావాలంటే దరఖాస్తు చేశాక... ఆధార్ కార్డు, రేషన్ కార్డు అడ్రస్ చూసి తిరస్కరిస్తారా.. లేక కొత్త ఇండ్లు కట్టుకోడానికి డబ్బులు ఇస్తారా... ఇంటి స్థలం లేకపోతే డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తారా, అసలే ఇవ్వరా.. అట్లాంటప్పుడు నిజమైన పేదలకు ఈ పథకం ఎలా న్యాయం చేస్తది. ఇక తెలంగాణ ఉద్యమం చేసి జైళ్లకు పోయినోళ్లు మాత్రమే ఉద్యమకారులా.. మిగిలిన వారు కాదా.. ఎఫ్ఐఆర్ అయినోళ్లకే ఇండ్లు ఇచ్చినప్పుడు శాంతియుతంగా ఉద్యమం చేసినోళ్లకు అన్యాయం చేసినట్లు కాదా.. అన్న ప్రశ్న తలెత్తుతుంది..?

**గృహజ్యోతి పథకం :** 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇచ్చే పథకం ఇది. కానీ దీనికి అప్లయ్ చేయడంలోనూ అనేక సందేహాలు ఉన్నాయి. సొంత ఊరిలో కాకుండా సిటీలో, టౌన్లలో పనులు చేసుకొని బతికేటోళ్లు చాలా వరకు అద్దె ఇండ్లలో ఉంటున్నారు. అలాంటి వారికి అద్దె ఇంటి కరెంట్ బిల్లుకు ఉచిత విద్యుత్‌ను వర్తింప చేస్తారా.. లేదా.. ఆధార్ కార్డు అడ్రస్‌లో ఉన్న ఇంటికే ఉచిత కరెంట్ ఇస్తారా.. ఇక సొంత ఊరిలో కాకుండా టౌన్‌లలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న వారికి ఉంటున్న దగ్గర ఉచిత కరెంట్ ఇస్తారా.. ఇవ్వరా... అసలు ఇలా రెండు మీటర్లు ఉన్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేయాలా.. వద్దా..

### రేషన్ కార్డు లేకుంటే..

ఇక అన్నింటికంటే ముఖ్యమైన సమస్య రేషన్ కార్డు లేనోళ్లు. వీళ్లు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఉంది. దరఖాస్తు ఫారంలో చివరకు జత చేయాల్సిన ప్రతుల కాలమ్‌లో.. ఆధార్‌కార్డు జిరాక్స్, తెల్ల రేషన్ కార్డు జిరాక్స్ అని చూపిస్తుంది. అంటే రేషన్ కార్డు లేనోళ్లు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు అన్నట్లే కదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. దీంతో ప్రజా పాలన కౌంటర్లకు వెళ్లిన చాలా మంది దరఖాస్తు చేయకుండానే వెనుతిరుగుతున్నారు. రేషన్ కార్డుల విషయంలో ఊరికో ముచ్చట, అధికారికో మాట చెబుతుండడంతో హైరానా పడిపోతున్నారు. కొత్త రేషన్ కార్డులు లేక పాత రేషన్ కార్డుల్లో ఉన్న ప్రకారం ఆధార్ కార్డుల్లో పేర్లు, వివరాలు మార్చుకునేందుకు ఆధార్ సెంటర్లకు పోటెత్తుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వ పెద్దలు స్పందించి దరఖాస్తు విషయంలో వచ్చే ప్రతి సందేహానికి క్లారిటీ ఇవ్వాలని కోరుతున్నారు.

## పథకాల కోసం బారులు



రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పథకాలకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో, వాటి కోసం ప్రజలు మీ సేవ కేంద్రాలకు పోటెత్తారు. శుక్రవారం కూడా భైంసాలో మీ సేవ వద్ద క్యూలైన్‌లో చెప్పులు పెట్టి పడిగాపులు కాశారు.
*- భైంసా, డిసెంబర్ 29*

నిర్మల్ జిల్లా భైంసాలో మీసేవ ఎదుట క్యూలో ఉంచిన చెప్పులు

# అభివృద్ధి పనులే లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ● బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

బజార్‌హత్నూర్, డిసెంబర్ 29: అభివృద్ధి పనులే బీఆర్‌ఎస్(టీఆర్‌ఎస్) పార్టీ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి బీటి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి కొత్తపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించనున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ ఐటీడీఏ నిధులు రూ.1కోటి వ్యయంతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆదర్శ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ మేకల వెంకన్న, తదితరులు సన్మానించారు. సర్పంచ్ పరాచ లావణ్య, ఎంపీపీ జయశ్రీ, జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీటీసీ తిరుమల, బీఆర్‌ఎస్ పార్టీ మండల యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు రమేశ్, చిల్కూరి భూమయ్య, చట్ల వినిల్, గజ్జయ్య, కొత్త శంకర్, సకేష్, జల్కె పాండురంగ్, జనార్దన్, భోజన్న, విలాస్, తదితరులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్‌లో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలి

నేరడిగొండ, డిసెంబర్ 29: ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మండలంలోని రాజురాలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఎంపీపీ రాథోడ్ సజన్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నేరడిగొండ, బోథ్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, దామెర్ల నారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ జాదవ్ అనూషబాయి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పెంట వెంకటరమణ, జాదవ్ రమేశ్, విశాల్ కుమార్, రాజు, మాజీ జడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, నాయకులు మండాడి కృష్ణ, వసంత్‌రావ్, శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంఈవో భూమారెడ్డి, ఎంపీవో శోభన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా దరఖాస్తుల స్వీకరణ

- జిల్లాలో 91 బృందాల ఏర్పాటు ● ఉచితంగా దరఖాస్తుల పంపిణీ
- దళారుల మాటలు నమ్మొద్దు ● ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్, డిసెంబర్ 29(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో అభయ హస్తం పథకం దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభయ హస్తం గ్యారెంటీ పథకాల కోసం ఈ నెల 28 ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జనవరి 6 వరకు పనిదినాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జిల్లా వ్యాప్తంగా 91 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 17 మండలాలు ఉండగా, వీటిని రెండు భాగాలుగా విభజించినట్లు తెలిపారు. 30 కంటే ఎక్కువగా గ్రామ పంచాయతీలు ఉన్న మండలంలో మూడు బృందాలు ఉంటాయని తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోలు పర్యవేక్షణ ఉంటుందన్నారు. 30 పంచాయతీల కంటే తక్కువ ఉన్న మండలాల్లో రెండు బృందాలు తహసీల్దార్, ఎంపీడీవోల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఆయా మండలాల్లో దరఖాస్తుల స్వీకరణను బృందాలు పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాయని తెలిపారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులు ఉండగా, ప్రతి వార్డుకో టీం చొప్పున ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఐదు గ్యారెంటీలు పొందడానికి మహాలక్ష్మీ పథకంలో భాగంగా నెలకు రూ.2500 ఆర్థిక సాయం, రూ.500 సిలిండర్, రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ. 15వేలు పొందడానికి రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కూలీలు ఏడాదికి రూ. 12000 కోసం, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, గృహజ్యోతి పథకంలో భాగంగా నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, చేయూత పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### దళారుల మాటలు నమ్మొద్దు

అభయ హస్తం గ్యారెంటీ పథకాలు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులను గుర్తించి పథకాలను పంపిణీ చేస్తామని తెలిపారు. దరఖాస్తు పత్రాలను ఉచితంగా ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులు నింపుతారని తెలిపారు. ప్రజలు జిరాక్స్ కేంద్రాలు, మీ సేవ సెంటర్లలో దరఖాస్తులు కొనుగోలు చేయవద్దని సూచించారు. పథకాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పినా, దరఖాస్తులు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దరఖాస్తు ఇచ్చిన తర్వాత సిబ్బంది నుంచి రసీదు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆధార్, రేషన్‌కార్డు, ఫొటోలు తీసుకొని కేంద్రాలకు పోతే అక్కడి సిబ్బంది అన్ని విధాలుగా సహకరిస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీపీఆర్వో విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

- ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిణి ప్రశాంతి ● ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పర్యటన

ఎదులాపురం/ఆదిలాబాద్ రూరల్/సోన్/ నిర్మల్ అర్బన్/ మామడ, డిసెంబర్ 29: ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిణి ప్రశాంతి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు పలు గ్రామాలు, నిర్మల్ పట్టణంలోని బాగులవాడ, నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లి, మామడ మండలంలోని బండల్ నాగాపూర్ గ్రామంలో పర్యటించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. ఏర్పాట్లను పరిశీలించారు. అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పెద్ద ఎత్తున స్పందన వస్తున్నదని తెలిపారు. దరఖాస్తులు సమర్పించిన వారికి రసీదు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, డీపీవో శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మున్సిపల్ కమిషనర్ శైలజ, నిర్మల్‌లో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, డీఆర్వో లోకేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మావల మండలంలో పరిశీలిస్తున్న ప్రత్యేక నోడల్ అధికారిని ప్రశాంతి



రత్నాపూర్ కాండ్లీలో అర్జీలను స్వీకరిస్తూ..

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
★ I, ASHOK KUMAR BHAIYYA (Old Name), R/o. 7-155, RP Road, Mancherial Dt.-504 208. Changed My Name as ASHOK BHAIYAMAHESHWARI (New), S/o. Giridharlal Bhaiyya.
NT-324500

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




# తగ్గిన రోడ్డు ప్రమాదాలు

- మహిళలపై నేరాల నియంత్రణ
- సైబర్ క్రైం, మత్తుపదార్థాలు నిరోధానికి కార్యాచరణ
- యువత పెడదారి పట్టకుండా ప్రణాళిక
- వార్షిక నేర నివేదికలో ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్‌కుమార్ రెడ్డి



జిల్లా వార్షిక నేర నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ డి. ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్, డిసెంబరు 29 ( నమస్తే తెలంగాణ): జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని ఆదిలాబాద్ ఎస్పీ డీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసి విలేకరల సమావేశంలో ఆయన జిల్లా వార్షిక నేర నివేదికను తెలియజేశారు. ఈ ఏడాది మహిళలపై నేరాల సంఖ్య కూడా తగ్గిందని, ఇందుకు షీటీం బృందాల కృషి ఎంతో ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 2022లో 3306 కేసులు నమోదైతే 2023లో 4050 కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. 2022 సంవత్సరంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య 286 ఉంటే ఈ ఏడాది 282 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. గతేడాది కోర్టుల్లో నేర నిరూపణ మేజర్ కేసులు 43 ఉండగా, ఈ ఏడాది వాటి సంఖ్య 33గా ఉందన్నారు. 2022లో హత్య కేసులు 11 నమోదు కాగా, ఈ ఏడాది 18 కేసులు నమోదైనట్లు తెలిపారు. కుటుంబాల్లో గొడవల కారణంగా ఈ కేసులు ఎక్కువగా నమోదయ్యాయన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా గతేడాది 1118 కేసులు పరిష్కారం కాగా, ఈ ఏడాది 1284 కేసులను పరిష్కరించినట్లు ఎస్పీ వివరించారు. గతేడాది మహిళలపై జరిగిన నేరాల సంఖ్య 329 ఉండగా, ఈ ఏడాది 309 ఉన్నట్లు తెలిపారు. గతేడాది గంజాయి కేసులు 18 నమోదు కాగా, ఈ ఏడాది 29 కేసులైనట్లు వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు గతేడాది 5494 నమోదు కాగా, ఈ ఏడాది కేసుల సంఖ్య 6714గా ఉందన్నారు. గతేడాది ఆర్థిక నేరాల కేసులు 188, ఉండగా ఈ సారి 264 గా ఉందని తెలిపారు. 2022లో పేకాట కేసులు 118 నమోదు కాగా, ఈ ఏడాది 90 కేసులు నమోదైనట్లు వివరించారు. గతేడాది జిల్లాలో మట్కా కేసుల సంఖ్య 91 ఉండగా, ఈ ఏడాది 42 నమోదైనట్లు తెలిపారు.

### సైబర్ క్రైం, గంజాయి నిరోధానికి చర్యలు

జిల్లాలో కొత్త సంవత్సరంలో సైబర్ నేరాలు నివారించడంతోపాటు గంజాయి సాగు, అక్రమ రవాణా నివారణ, మట్కా అరికట్టడానికి పకడ్బందీ ప్రణాళికలు తయారు చేస్తామని ఎస్పీ తెలిపారు. యువత సెల్‌ఫోన్ల వినియోగంతో పెడదారి పట్టకుండా చర్యలు తీసుకుంటామన్నారు. న్యూఇయర్ వేడుకల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు పెడుతామని హెచ్చరించారు. ఎవరూ మద్యం తాగి రోడ్ల పైకి రావద్దని సూచించారు. డీఎస్పీలు ఉమేందర్, శ్రీనివాస్, నాగేందర్ పాల్గొన్నారు.